క్లుప్తంగా

నేడు గణిత శాస్త్ర అవధానం

గంగాధరనెల్లూరు: మండలంలోని వేపంజేరి గ్రామంలోని హైస్కూల్లో సోమవారం గణిత శాస్త్ర అవధానం నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు గణిత అవధాని అరుణ శివప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులతో గణిత ప్రజ్ఞాధారణ(గణిత అవధానం) కార్యక్రమం జరుగుతుందని ఏపీ గణిత శాస్త్ర (మ్యాథ్స్) ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు ఎం.చంద్రమనాయుడు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వేపంజేరి హైస్కూల్ హెచ్ఎం, టీచర్లు, మండలంలోని వివిధ హైస్కూళ్లలోని గణిత టీచర్లు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

టైలర్ల సంఘం అధ్యక్షుడిగా ఉమాపతి



సంఘ సమావేశంలో టైలర్లు

నగరి: మున్సిపాలిటీ, మండల టైలర్ల సంఘ అధ్యక్షుడిగా ఎం.ఉమాపతి ఎన్నికయ్యారు. గతంలో అధ్యక్షుడిగా ఉన్న అయూబ్ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆదివారం పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో సమావేశమైన టైలర్ల సంఘ సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా ఎం.ఉమాపతి, కార్యదర్శిగా టి.వీరయ్య, ఉపకార్యదర్శిగా జగన్నాథం, సమన్వయకర్తలుగా శ్రీనివాసులు, నాగూర్ బాషా, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా రాజేందర్, వరదరాజులు, హమీద్, సలహా కమిటీ సభ్యులుగా జగదీష్, సభ్యులు శేఖర్, రాజా తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై నారాయణుడి దర్శనం

గంగాధర నెల్లూరు: వేపంజేరి గ్రామంలోని శ్రీలక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో గరుడ వాహనంపై నారాయణుడు భక్తులకు ప్రత్యేక అలంకరణతో దర్శనమిచ్చారు. ఆదివారం గురు పౌర్ణమి సందర్భంగా గరుడ వాహనంపై నారాయణుడిని కొలువుదీర్చి పట్టు వస్త్రాలు పూల హారతులతో ప్రత్యేక అలంకరణ చేసి వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ వెంకటేష్‌రెడ్డి, అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

సమాజానికి దీపం గురువు



రిటైర్డ్ హెచ్ఎం దామోదర్ రెడ్డికి సన్మానం

గంగాధరనెల్లూరు: విద్యతోపాటు వివిధ రంగాలలో రాణించాలంటే గురువు త్యాగం ఎంతో ఉందని సమాజానికి దీపం గురువు అని రాష్ట్ర బీజేపీ ఓబీసీ కార్యవర్గ సభ్యుడు సుధాకర్ అన్నారు. గురు పౌర్ణమి సందర్భంగా గంగాధరనెల్లూరులోని రిటైర్డ్ హెడ్మాస్టర్ దామోదర్ రెడ్డిని శాలువాలతో సత్కరించి గురుదక్షిణ సమర్పించుకొని సత్కరించారు. ఈ కార్యక్రమంలో వీఎం.నారాయణమూర్తి ఆచారి, సుందర్ రాజు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బడ్జెట్‌లో ఉద్యోగులకు ప్రాధాన్యతనివ్వాలి

చిత్తూరు కలెక్టరేట్: రాష్ట్ర బడ్జెట్‌లో ఉద్యోగులకు ప్రాధాన్యతనివ్వాలని ఆపస్ (ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం) రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని బడ్జెట్‌లో తగిన కేటాయింపులు చేయాలన్నారు. ఉద్యోగుల ఆర్థిక బకాయిల చెల్లింపు, 12వ వేతన సవరణకు సంబంధించిన మధ్యంతర భృతి, కరువుభత్యం బకాయిలకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని సూచించారు. ఉద్యోగుల ఆశలను వమ్ముచేయకుండా న్యాయం చేయాలని కోరారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

బంగారుపాళెం: వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సీఐ లక్ష్మయ్య అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం మండలంలోని మహాసముద్రం టోల్ ప్లాజా వద్ద సిబ్బందితో కలసి వాహనాలు తనిఖీ చేపట్టారు. రికార్డులు సక్రమంగా లేని వాహన దారులకు ఆన్‌లైన్ ద్వారా జరిమానాలు వేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనదారులు తప్పని సరిగా లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. కారులో ప్రయాణించేవారు విధిగా సీట్ బెల్టు ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే లైసెన్సులు రద్దు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. వాహనదారులు రహదారి నింబంధనలు పాటించి వాహనాలు నడపాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరమని తెలిపారు. ప్రమాదాల బారినపడితే తల్లిదండ్రులకు శిక్ష తప్పదన్నారు. వాహనాల తనిఖీలో ఏఎస్ఐ రామచంద్రారెడ్డి, సిబ్బంది అస్గర్, బెనర్జీరావు, ద్వారకనాథ్ పాల్గొన్నారు.

ఆడి నెల.. ఆలయాలు కళకళ

ఆచార వ్యవహారాలకు పెద్దపీట వేసే సనాతన హైందవ సంప్రదాయంలో ప్రతినెలా ప్రత్యేకత సంతరించుకున్నదే. తొలకరి జల్లులతో ప్రకృతి పచ్చని శోభను సంతరించుకునే వేళ అరుదెంచే ఆడి నెల తమిళనాడు రాష్ట్ర సరిహద్దులో ఉన్న నగరి నియోజకవర్గంలో అనేక విశేషాలతో కూడుకుంది. చంద్రగమనం పూర్వాషాఢ నక్షత్ర సమీపంలో ఉన్నందున ఆడి నెలగా పిలుచుకుంటారు. శుభకార్యాలకు అవకాశం లేకున్నా ఆధ్యాత్మికంగా ఎన్నో ప్రత్యేకతలు కలిగి ఉన్నది ఆషాఢం ఈ నెల 17వ తేదీన ప్రారంభమైంది.

– నగరి



నేత్ర ప్రదాయిని దేశమ్మ ఆలయంలో భక్తుల సందడి

- శుభకార్యాలకు దూరం
- వ్యవసాయానికి శుభారంభం

ఏ శుభకార్యాలూ చేసేందుకు వీలులేదని భావించే ఆషాఢ మాసం నిజానికి ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉంది. తొలి ఏకాదశి, గురుపౌర్ణమి, ఛాతుర్మాస వ్రతాలు, రథయాత్రలు, ఆడికృత్తిక, ఆడి శుక్రవారం, ఆడి పెరుక్కు అనే పండుగలు, పూజలన్నీ ఈ నెలలోనే జరుగుతాయి. శక్తి ఆలయాలు ఈ నెల భక్తులతో కిటకిటలాడుతాయి. భక్తులు ఆలయాల వద్ద అంబళ్లు, గంజి సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు.

శుభకార్యాలకు దూరం

ఆడినెలను పూర్వీకులు శూన్యమాసంగా భావిస్తారు. ఈ మాసంలో సాధారణంగా శుభకార్యాలు నిర్వహించరు. ఆషాఢంలో గృహప్రవేశం, నిశ్చితార్థ, వివాహం, ఉపనయనం, తదితర శుభ కార్యాల నిర్వహణ అనువుగా ఉండదని భావిస్తారు. ఈ నెల ప్రారంభ సమయానికి చల్లటి గాలులతోపాటు విరివిగా వర్షాలు కురుస్తుంటాయి. వ్యవసాయ పనులు కూడా జోరుగా సాగుతుంటాయి. ప్రతి ఒక్కరూ వ్యవసాయ పనిలోనే నిమగ్నమవుతున్నందున శుభకార్యాలకు తావు ఉండదు.



అడవికొత్తూరులో సాగుకు సిద్ధమవుతున్న రైతన్న

కొత్త దంపతులకు ఎడబాటు

నగరి ప్రాంతంలో తమిళ సాంప్రదాయాలు ఎక్కువగా పాటిస్తారు. ఆడి నెల కొత్తగా వివాహం చేసుకున్న దంపతులను దూరంగా ఉంచే సంప్రదాయం అనాదిగా వస్తోంది. ఇంటిల్లిపాది పంటల సాగు పనిలో తీరికలే కుండా ఉంటారు. కాబట్టి కొత్త అల్లుడికి మర్యాదలు చేసే వీలు ఉండకపోవడం ఒక కారణంగా చెప్పవచ్చు. నవ దంపతులు సంసారిక జీవనం ఫలితంగా గర్భధారణ జరిగితే ప్రసవ సమయం వచ్చే ఏడాది ఏప్రిల్. మే నెలల్లో ఉంటుంది. తీవ్రమైన ఎండాకాలం కాబట్టి తల్లీబిడ్డల ఆరోగ్యానికి మంచిది కాదు. అందుకే ఆడి నెలలో నవ దంపతులను నెల రోజులపాటు దూరంగా ఉంచుతారు.

శాకాంబరీదేవీ.. పాహిమాం

- కూరగాయల అలంకరణలో కాణిపాకంలో కనువిందు
- అభిషేక, పూజలు అందుకున్న దేవతామూర్తులు
- అశేషజనంతో నిండుకున్న ఆలయం



కూరగాయల అలంకరణలో శాకాంబరిదేవి, క్యూలో భక్తులు

కాణిపాకం: ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో అనుబంధ ఆలయంలోని మణికంఠేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శాకాంబరీదేవి ఉత్సవం వైభవంగా సాగింది. ఈ సందర్భంగా ప్రధాన ఆలయంతోపాటు అనుబంధ ఆలయాల్లో కొలువై ఉన్న దేవతామూర్తులకు సైతం కూరగాయలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణాన్ని సొరకాయలు, దొండ, బెండకా యలు, కరివేపాకు, నిమ్మకాయలతోపాటు పలు రకాల కూరగాయలు, పండ్లతో అందంగా తీర్చిదిద్దారు. ఈ కూరగాయల అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. భక్తులు కుటుంబ సమేతంగా తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. స్వామి ప్రసాదాన్ని స్వీకరించేందుకు భక్తులు బారులు తీరి కనిపించారు. భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణంలోని క్యూలైన్లు కిటకిటలాడాయి. ఉత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే మురళీమోహన్ సారెను సమర్పించి, స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ వెంకటేశు, దాతలు రవీంద్రారెడ్డి, మోహన్‌రెడ్డి, సత్యనారాయణశెట్టి, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గురు పూర్ణిమ వేడుకలు



పాలాభిషేకం చేయడానికి బారులు తీరిన భక్తులు

నగరి: బేరివీధిలోని శ్రీసాయిరాం మందిరంలో ఆదివారం గురుపూర్ణిమ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం ఓంకార కాగడ హారతితో బాబా మేల్కొలుపు సేవ నిర్వహించారు. అనంతరం షిరిడీ సాయిబాబా విగ్రహానికి భక్తులు స్వహస్తాలతో పాలాభిషేకం చేయడం ప్రత్యేకతను సంతరించుకుంది. భక్తులు పాలాభిషేక మహోత్సవానికి అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం సాయిబాబాను ప్రత్యేకంగా అలంకరించి సాయిసత్యవ్రతం నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయం వద్ద అన్నదానం చేశారు. అడ్వొకేట్ మురళీధర్, లీలావతమ్మ, సావిత్రమ్మ, భాస్కర్ ఆచారి, గీతమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు పలువురు సాయిసేవకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా గురు పౌర్ణమి

పుత్తూరు: పట్టణంలోని శ్రీషిరిడీ సాయిబాబా ఆలయంలో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు కాగడ హారతి, 7 గంటలకు బాబాకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. 9 గంటలకు గురు చరిత్ర పారాయణం చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు సంధ్య హారతినిచ్చారు. అనంతరం బాబా ఊరేగింపు ఉత్సవం బాజాభజంత్రీలు, కోలాటాల నడుమ పురవీధుల్లో కొనసాగింది. ఈ సందర్భంగా భక్తులు కర్పూర హారతులిచ్చి మొక్కులు తీర్చుకొన్నారు. రాత్రి 8 గంటలకు శేజ్ హారతి (పవళింపు హారతి) నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

శ్రీకృష్ణుడికి పౌర్ణమి హారతులు

పట్టణంలోని శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని గీతా మందిరంలో వెలసి ఉన్న శ్రీకృష్ణ పరమాత్మకు గురు పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు చేశారు. సాయంత్రం గీతా పారాయణం, భజనలు నిర్వహించారు. అనంతరం మహిళలు శ్రీకృష్ణ భగవానుడికి పౌర్ణమి హారతులిచ్చారు.

ఘనంగా గురుపూర్ణిమ వేడుకలు

వెదురుకుప్పం: టీకేఎంపురం గ్రామంలో వెలిసిన శ్రీషిరిడీ సాయినాథుని ఆలయంలో ఆదివారం గురుపూర్ణిమ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జామునే సుప్రభాత సేవతో సాయి బాబాను మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. తదుపరి వేదపండితుల ఆశీర్వచనంతో పాలాభిషేకం చేశారు. అనంతరం బాబాను పట్టుపీతాంబరాలు, వెండితొడుగులతో కూడిన ఆభరణాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. ఆలయ అర్చకులు భక్తిప్రపత్తులతో విశేష పూజలు చేశారు. భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. మధ్యాహ్నం కాగడ హారతి అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కోదండరెడ్డి, నాయకులు యుంగధర్‌రెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని చింతల గుంట, నక్కలాంపల్లె ఎస్సీ కాలనీల్లో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలయాల్లో గురుపూర్ణిమ వేడుకలు జరిగాయి.

ఘనంగా గురు పూర్ణిమ

నింద్ర: మండలంలో ఆదివారం గురు పూర్ణిమ పురస్కరించుకుని మండలంలోని వివిధ ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన నింద్రలో ఓంశక్తి ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కేఆర్ పాళెం గ్రామంలోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీనారాయణ యాగం, కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం టీటీడీ ఆధ్వర్యంలో హరికథా గానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పుత్తూరులో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా, వెదురుకుప్పం: సాయి బాబా ఆలయంలో భక్తుల పూజలు

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం



ప్రసంగిస్తున్న సీనియర్ పిరమిడ్ మాస్టర్ శైలజ, హాజరైన మహిళలు

తవణంపల్లె: ప్రతి ఒక్కరూ ఆనాపానసతి ధ్యానం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని సీనియర్ పిరమిడ్ మాస్టర్ శైలజ వివరించారు. మండలంలోని సిద్ధంపల్లె సమీపంలోని శ్రీ విఘ్నేశ్వర పిరమిడ్ మహాశక్తి క్షేత్రంలో మూడు రోజులపాటు పత్రీజీ మహిళా చైతన్య కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె ప్రసంగిస్తూ ది పవర్ ఆఫ్ మెడిటేషన్, ది పవర్ ఆఫ్ థింకింగ్, ది పవర్ ఆఫ్ మహిళా చైతన్యంతో పాటు 18 ఆదర్శ సూత్రాలు, 13 వ్యక్తిగత సూచనలతో ధ్యానం గురించి వివరించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ, గ్లోబల్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గోపాలకృష్ణమూర్తి, కన్వీనర్ రాధిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అతిథి శైలజ సందేశాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. పత్రిజీ ఆశయ సాధనకు ధ్యానులు నడుం బిగించాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా ధ్యానులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు సిమెంట్ రోడ్డు నిర్మాణం



ఎం.అగరంలో సిమెంట్ రోడ్డు

విజయపురం: మండలంలోని ఎం.అగరం గ్రామంలో తిరుపతి తుడా నిధులు సుమారు రూ.12లక్షల వ్యయంతో అధికారులు సిమెంట్ రోడ్డు వేశారు. ఆదివారం ఎం.అగరం సొసైటీ కార్యాలయం నుంచి ఎం.అగరం దళిత వాడ రోడ్డు వరకు సిమెంట్ రోడ్డు వేశారు. ఇది వరకు చిన్నపాటి వర్షానికి రోడ్డు బురదమయంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడేవారు. అయితే సిమెంట్ రోడ్డు వేయడంతో ఆ సమస్య తీరిందని స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వీధి వ్యాపారులకు గొడుగులు పంపిణీ



వీధి వ్యాపారులకు గొడుగులు అందిస్తున్న లయన్స్‌క్లబ్ నిర్వాహకులు

నగరి: లయన్స్ క్లబ్ నిర్వాహకులు వీధి వ్యాపారులకు నీడ కోసం గొడుగులు పంపిణీ చేశారు. ఆదివారం నగరి బస్టాండ్ కూడలి వద్ద, బజారులో, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద, కొండచుట్టు మండపం వద్ద రోడ్డు పక్కన చిరు వ్యాపారం చేసుకునే వారికి గొడుగులు అందించారు. ఈ సందర్భంగా నగరి లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు రాజరాజేశ్వరి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా ఆదరణ నోచుకోనివారికి, నిరాశ్రయులకు పలు సేవలు అందిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఇచ్చే గొడుగులు ఎండ, వాన సమయంలో వారికి ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ హెచ్.ప్రభాకర్ రాజు, డైరెక్టర్ హరిప్రసాద్ వర్మ, మాజీ అధ్యక్షుడు ఏ.మోహన్, సభ్యులు రామ్మోహన్, మహమ్మద్ షఫీ, దేవన్, పొన్నురంగం తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అప్రమత్తత అవసరం



ఎయిడ్స్ నివారణపై అవగాహన కరపత్రాల పంపిణీ

కార్వేటినగరం: ఎయిడ్స్ వ్యాధిపై యువత అప్రమత్తంగా ఉండాలని స్టెప్స్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ ఆర్ముగం అన్నారు. ఆదివారం స్థానిక ద్రౌపదీ ధర్మరాజుల స్వామి ఆలయ ఆవరణలో ఎయిడ్స్ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు మేనేజర్ మాట్లాడుతూ ఎయిడ్స్ నివారణ యువతరంతోనే సాధ్యమని, గ్రామాల్లో కూడా యువతకు అవగాహన కల్పించి ఎయిడ్స్ రహిత భారత దేశంగా తీర్చిదిద్దాలన్నారు. వ్యసనాల బారిన పడి ప్రాణాంతకమైన ఎయిడ్స్‌కు గురికాకుండా ఉండాలన్నారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి ఎలా వ్యాపిస్తుంది, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే హెచ్ఐవీతో జీవిస్తున్నవారు ఏఆర్టీ మందులను సకాలంలో తీసుకుంటూ వారి జీవనశైలిని సాధారణంగా కొనసాగించవచ్చన్నారు. కార్వేటినగరం గ్రామ వీధుల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్టెప్స్ స్వచ్ఛంద సంస్థ అవుట్ రీచ్ వర్కర్ భువనేశ్వరీ, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాల గురునాథీశ్వరస్వామికి రుద్రాభిషేకం



యాగశాల పూజలు చేస్తున్న వేదపండితులు

పాలసముద్రం: రాచపాళెం గ్రామంలో వెలసిన బాలగురునాథీశ్వర స్వామికి పౌర్ణమి పురస్కరించుకుని ఆదివారం రుద్రాభిషేక పూజలు, వివిధ యాగశాల పూజలు చేశారు. ఉదయం భక్తులు యాగశాలకు కావాల్సిన పూజసామగ్రితో మంగళ వాయిద్యాల నడుమ గ్రామాల్లో ఊరేగించి స్వామి వారికి సమర్పించారు. వేదపండితులు నవగ్రహ హోమం, శాంతి హోమం వంటి యాగశాల పూజలు చేశారు. వివిధ హోమం నిర్వహించిన కలశ నీటితో స్వామివారికి రుద్రాభిషేకం చేశారు. సాయంత్రం స్వామివారిని పాలు, పెరుగు, చందనం, తేనె, నెయ్యితో అభిషేకించి, సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు.

ఆకట్టుకున్న దుర్యోధన వధ



దుర్యోధనుడిని వధిస్తున్న భీమసేనుడు

పాలసముద్రం: ఎస్ఆర్ఆర్ గ్రామంలో వెలసిన ధర్మరాజులస్వామి మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగిన గధాయుద్ధం, దుర్యోధన వధ ఘట్టాలు రసవత్తరంగా సాగాయి. వేణుగోపాల నాట్య బృందంలో భీమసేనుడిగా మునిక్రిష్ణ, దుర్యోధనుడిగా శివయ్య వేషాధారణ ఆకట్టుకుంది.

కురుక్షేత్ర యుద్ధం ముగింపులో సర్వమూ కోల్పోయిన దుర్యోధనుడు అస్త్ర సన్యాసం చేసి గంగలో తపస్సుకు వెళ్లడాన్ని ప్రదర్శించారు. అప్పుడు భీమసేనుడు గంగలో తపస్సు చేస్తున్న దుర్యోధనుడిని తీసుకెళ్లి యుద్ధానికి ప్రేరేపించి, వధించడం ఆద్యంతం ప్రజలను ఆకట్టుకుంది. దుర్యోధనుడిని వధించే సన్నివేశాన్ని కళాకారులు రక్తికట్టించారు. ఈ సన్నివేశాన్ని తిలకించడానికి మండల పరిధిలోని ప్రజలే కాకుండా తమిళనాడు నుంచి వందలాదిగా తరలివచ్చారు.



దుర్యోధన వధను తిలకించడానికి వచ్చిన జనసందోహం

అలరించిన బలి బండి కుంభాలు



బలికూడుతో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

వెదురుకుప్పం: పచ్చికాపల్లంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బలి బండి కుంభాల కార్యక్రమం అలరించింది. ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భాగవతారిణి భారతి ఆధ్వర్యంలో హరికథా కాలక్షేపం సాగింది. సాయంత్రం బకాసురుని వేషధారి బలికూడుతో అమ్మవారి ఆలయాన్ని ప్రదక్షిణగా చేసి ప్రసాదాలను అమ్మవారికి సమర్పించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు బలికూడుతో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా బాణసంచా పెద్ద ఎత్తున పేల్చి యువత సందడి చేశారు. బాణ సంచా మోతలతో ఆలయ ఆవరణం దద్దరిల్లిపోయింది. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధికంగా వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సోమవారం అమ్మవారి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



భక్తుల సందడి